# సలహా

ఆంధ్రజ్యోతి 1988

ఈ సమాజానికి మనల్ని నిర్దేశించే హక్కు వున్నప్పుడు—మన బాధ్యత తీసుకునే గొప్ప లక్షణం కూడా వుండాలి.

—జయప్రద

డాక్టర్‌గారూ !

ఆ అమ్మాయి ఆగిపోయింది. ఆమె ముఖంలోకి చూచాను నేను. ఆ అమ్మాయి ఏదో చెప్పాలని చెప్పలేక పోతోందని ఆమె పెదాలు చెపుతున్నాయి.

ఆ అమ్మాయి అందమయిన కళ్ళ కలల్ను, ఆశాభంగం చెంది అలసిపోయినట్టుగా, ఆ కళ్ళక్రింద నల్లటి నీడలు నా టేబుల్‌పైన సున్నితంగా, నీరసంగా వుంచిన ఆమె పొడవాటి చేతివేలి ఉంగరపు ఒణుకుకు నా టేబుల్ మీదున్న అద్దం శబ్దం చేస్తోంది.

ఆ అమ్మాయి నా పరిసరాలకు సర్దుకునేవరకూ ఆగాను. ఆ తర్వాత మెత్తగా అన్నాను.

"చెప్పమ్మా"

ఆ అమ్మాయి నిదానంగా కళ్ళెత్తింది. మరలా వెంటనే కను రెప్పలు వాల్చేసుకుంటూ అంది.

"నేను.... నేను.... చెడిపోయాను డాక్టర్" ఆ అమ్మాయి కంఠంలో తడి.

నేను ఉలిక్కిపడలేదు. నాకిది నా ఈ యాభయ్ యేళ్ళ ప్రాక్టీసులో అలవాటయి పోయింది. ఆ పిల్లను మరీ ఇబ్బందిలో పెట్టడం ఇష్టంలేక నేనే సూటిగా అడిగాను.

"ఎన్నో నెల?"

ఆ ప్రశ్నకు ఆ పిల్ల ఇచ్చిన జవాబు విన్నాక నా తొందర పాటుకు నాకే అసహ్యమనిపించింది.

"అలాటిదేం లేదు డాక్టరుగారూ."

మరి నా దగ్గరకొచ్చి పనికట్టుకుని నేను చెడిపోయాను డాక్టర్ అని చెప్పాల్సిన అవసరం ఆ పిల్లకేమొచ్చింది? ఆలోచిస్తున్నారు. ఆ అమ్మాయే మరలా అంది.

నేనీ సంగతి ఎవరితో ఒకరితో చెప్పకొంటే ఇక బ్రతకలేనని పిస్తోంది డాక్టర్. నేను బ్రతకాలి. నేను, నా పిల్లల కొరకు బ్రతకాలి. నేను మానసిక వ్యాధి నుండి బయటపడి నా పిల్లలకు నేను మిగలాలి మీరునాకేదయినా సలహా ఇవ్వాలి డాక్టర్.

ఆ పిల్ల గబ గబ అంతవరకు అనేసి, ఇబ్బందిగా మొహమాటంగా ఆగింది.

"మీ టైమ్ నేను పాడు చేస్తున్నానేమో!"

"ఫరవాలేదు....ఫరవాలేదు చెప్పమ్మా!" ఆమె వెనక పేషెంట్సు చాలా మంది మన్నారు.

అయినా మీ సలహా కావాలి డాక్టర్!" అని ఎంతో దయనీయంగా అడుగుతున్న ఆ పిల్లతో కారణం ఏదయినా కానివ్వండి. మానసిక రుగ్మతతో బాధపడుతున్న ఆమెతో "ఇప్పుడు టైమ్‌లేదు" అని ఆ పిల్ల గుండెల్లో మరింత భారాన్ని నింపాలనిపించలేదు.

ఆ అమ్మాయి మరో ఐదు నిముషాలు వరకూ మాట్లాడలేక పోయింది.

బహుశ మాట్లాడడానికి కావాల్సిన ధైర్యాన్ని కూడదీసుకుంటూ వుంటవచ్చు.

నా వయసుతో పోల్చిచూస్తే ఆమే చిన్నదిగానే కన్పించినా, ఆ పిల్లకు ముప్పై ఏళ్ళపైనే వుండొచ్చు వయస్సు.

ఆ అమ్మాయి తలెత్తింది. నా వైపు క్షణం భాషకందని భావంతో చూచింది. తర్వాత మెల్లగా చెప్పింది. నేను....నేను పదేళ్ళగా ఒకరికి భార్యను. నలుగురు బిడ్డలకు తల్లిని....కానీ డాక్టరుగారూ! నేను నిజమైన తల్లిని కాగలిగానేగానీ ఎంత ప్రయత్నంచేసినా నిజమైన భార్య స్థానాన్ని పొందలేకపోయానండీ!

ఆమె కంఠం వణికింది. ఆమె కళ్ళు వర్షించ లేదుగానీ, నాకు తెలుసు ఆమె మనసు ఏడుస్తోంది. సర్దుకుంటూ మరలా చెప్పసాగిందామె.

"కొన్ని ఏళ్ళుగా, క్షణకాలమైనా అతని గుండెల్లో నిజమైన భార్యగా బ్రతకాలని ప్రయత్నించి, ప్రయత్నించీ అలసిపోయానండీ. ఆ తర్వాత యంత్రంలా బ్రతకడం నేర్చేసుకున్నాను. అదే జీవితమని సరి పెట్టుకున్నాను. నా భర్త, నా కళ్ళముందే పరాయిస్త్రీతో నా పడక గదిలో వున్నా పట్టించుకోనంత విరక్తిలో మునిగిపోయాను. కానీ డాక్టర్

గారూ, నాకు రాజశేఖరం తారసపడ్డాక గానీ నేను పోగొట్టుకున్నదేవిటో నాకు తెలిసి రాలేదు. ఇప్పుడు పది సంవత్సరాల కాలాన్ని ఎలా భరించానా? అన్పిస్తోంది. నిజం డాక్టర్! ఈ పదినెలల పరిచయంలో అంతటి అపురూపమైన స్నేహానందించాడతను."

"స్నేహమా?" రెట్టించాను నేను.

"నాకు నిజం కావాలి."

"నేను మీతో అబద్ధం చెప్పాలని రాలేదు డాక్టర్ గారూ! కాకపోతే కొంత నేరుగా చెప్పలేక పోతున్నానంతే."

ఆ అమ్మాయి తల వంచుకుంది.

"స్నేహాన్ని మించిన ఆకర్షణ మీలో వుంది. నేను ఒప్పుకుంటాను." అని గొణిగి, తలెత్తి గొంతు పెంచి మరలా చెప్పసాగింది.

"డాక్టర్ గారు! కన్నె పిల్లగా నేనూ కోటికలలు కన్నాను. పగలంతా అతని చుట్టూ తిరుగుతూ, అతని కనవసరమైన వన్నీ అమర్చి పెట్టడం, రాత్రి అతని ఎదమీద నిశ్చింతగా పడుకుని కబుర్లు చెప్పుకోవడం—నాకు అతను అతనికి నేను తప్ప మరో ప్రపంచం లేదు నా ఊహల్లో."

"కానీ డాక్టరుగారూ! దాంపత్య జీవితమంటే కేవలం చీకట్లో కోరికలు తీర్చుకోవడమేనని తెలిసాక అగాధంలో పడిపోయానండి. నా భావుకత నాకు శాపమైపోయింది. నేనంటే అతనికి వాంచ తప్ప ప్రేమ లేదనీ, నా కళ్ళల్లో నీళ్ళు అతనిలో పైశాచికమైన ఆనందాన్ని రేపుతున్నాయని తెలుసుకున్నప్పుడు, ఎంత వ్యధ ననుభవించానో, అది ఎంత గుండెకోతగా వుండేదో మీరూహించగలరా?" ఆమె క్షణం ఆగింది.

తన గుండెల్ని నలిపేస్తున్న నిరాశను ప్రక్కకు నెడ్తూ మరలా చెప్పసాగింది.

"పదేళ్ళ మోడువారిన జీవితం తర్వాత. నాకు తారసపడ్డ స్నేహితుని దగ్గర నుండి నేను కోరుకున్న మమకారం అందంగానే అది నిజమని తెలియగానే, నాకు మరలా ప్రాణం వచ్చింది. అతని సాన్నిహిత్యములో నాకు ఉపశాంతి లభించింది. పదేళ్ళగా స్పందించని నా గుండె. అతని స్పర్శకు స్పందించింది. అతని మమకారములో కరిగిపోయింది. అతని మీద నా ఈ ఆకర్షణ గురించి నేను ఆత్మవిమర్శ చేసుకుని ఇది తప్పు అని చెప్పుకుంటూనే, అతని చల్లటి స్నేహంలో, ఆ ప్రేమలో అతనికి మరింత సన్నిహితంగా వచ్చేసాను. నాకు తెలుసు పెళ్ళయిన అమ్మాయిని నలుగురు బిడ్డల తల్లిని....ఇది చాలా అన్యాయం. కానీ డాక్టరుగారూ! నా భర్త దగ్గర నుండి నేను పొందిన మొరటు సుఖానికి, ఇతని దగ్గర నుండి నేను చవిచూచిన అపురూపమయిన ప్రేమకి పోల్చి చూచుకుంటే....నాది దోషం కాదనిపిస్తుంది క్షణం...."

ఆ అమ్మాయిని ఆపేసాను నేను.

"కానీ అమ్మాయీ! ఇతనిది ప్రేమేననీ నమ్మక మేమిటి? ఆడవాళ్ళని లొంగదీసుకోవడానికి ప్రతి మొగవాడూ, దానిని ప్రేమేనంటాడు లేదా పెళ్ళి చేసుకుంటానంటాడు. నీ విఫల ప్రేమను ఆధారంగా తీసుకుని రాజశేఖరం మాత్రం నిన్ను ట్రాప్ చెయ్యడం లేదని గ్యారంటీ ఏమిటి?"

ఆ అమ్మాయి కళ్ళు మొదటి మారుగా, తన అపురూపమైన స్నేహితుడ్ని తలచుకుని కాబోలు వెలిగాయి.

"లేదు డాక్టరుగారూ! నేను టీనేజ్ పిల్లను కాను. అంత మాత్రం అర్థం చేసుకోలేనా? పైగా....పైగా...." ఆమె ఆగింది.

కాస్త సంకోచంగా చూసింది.

తర్వాత మరలా తనే అంది.

"డాక్టరుగారూ! నాకెప్పుడూ అతని సమక్షంలోనే వుండాలని

పిస్తుంది. ఇది తప్పు అన్పించినప్పుడు అతని ఛాతీమీద నా తల అసహనంగా కదలడం అతను వెంటనే గమనించి, నన్ను లేపి కూర్చోబెట్టేవాడు.

నేను తర్వాత పశ్చాత్తాపపడ్డానని, నేను చనువు తీసుకోబోయినా అతను నాకు వీలయినంత దూరంగానే వుంటాడు....మీరు నమ్ముతారా? కేవలం చీకటి తప్పనే మీరూ ఈ సమాజంలాగే తప్పుగా భావిస్తే, అలాటి తప్పు మేమింత వరకు చేయలేదు."

నేను కాస్త ఆశ్చర్యపోయాను.

"మీ ఇద్దరి మధ్య ఆకర్షణ వుందంటున్నావు. పది నెలల మీ పరిచయంలో, నీ భర్త మీద నీకున్న విముఖతలో నువ్వు అబద్ధం చెపుతున్నావమ్మా విజయా....యాభయ్ సంవత్సరాల అనుభవాలతో, నా తల నెరసిపోయింది. నువ్వు నన్ను మోసం చేయలేవు...."

చేతులు జోడించింది విజయ.

"మీరు నమ్మాలి డాక్టర్! నేను నిజమే చెపుతున్నాను."

నాకెప్పుడయినా అశాంతిగా వుంటే అతననేవాడు.

"విజయా! చూడూ....నువ్వు నా స్నేహం వల్ల ఇంతటి మనో వ్యధకు గురి అయ్యే పక్షంలో, దానిని మనం ఎందుకు ఆహ్వానించాలి? కాస్త మనిద్దరం నిగ్రహించుకోగలిగితే, నీ కింత వ్యధ కలగదుగా. చెప్పు....చెప్పు విజయా! నువ్వు సంతోషంగా వుండడానికి నువ్వేం చేయమన్నా చేస్తాను. నీ శాంతిని ఖర్చుపెట్టా నేను సుఖాన్ని పొందాలి? వద్దు విజయా! మనిద్దరం కేవం స్నేహితులుగానే మిగిలిపోదాం. ఈ స్వర్గా సుఖంలో శాంతిలేనప్పుడు ధాన్ని మనం వాంఛించడం వివేకం కాదు."

ఆమె అలా తన స్నేహితుడితో. తన మధురమైన క్షణాలను గుర్తుచేసుకుంటూ, చేసుకుంటూ ఆగి ఆవేశంగా అంది.

"చెప్పండి డాక్టరు గారూ! అలాంటి....అలాంటి శేఖరాన్ని అనుమానించమంటారు?"

నను జవాబు చెప్పలేదు.

ఆమే మరలా మొదలెట్టింది.

ఈసారి ఆ కంఠంలో విచారం.

"నేను అతని చల్లని స్నేహంలో సేద తీర్చు కుంటూనే, ఒకోక్కసారి గిల్టీగా ఫీల్ అయ్యేదాన్ని. ఏ సినిమా చూసినా, ఏ కథ చదివినా, అందులో కవులు వర్ణించే పవిత్రతను, దానిని కాపాడుకోవడానికి, మన దేశంలో స్త్రీలు ఎంతగా ప్రయత్నించేదీ, చదివీ, చూసీ, నన్ను నేను చాలా నీచంగా ఊహించుకునేదాన్ని. ఒకరోజు అతనితో అనకుండా వుండలేకపోయాను.

"నువ్వు....నువ్వు....నా గురించి ఏమనుకుంటున్నావు. ఒక వ్యభిచారిణిలా...."

అతను చప్పున నా నోరు మూసాడు.

"మరెప్పుడూ అలా మాట్లాడి నన్ను బాధ పెట్టకు విజయా!" అతని కళ్ళల్లో తడి.

"నేను చలించిపోయాను. పదేళ్ళ మా సంసార జీవితంలో ఏ మధురస్మృతీ లేకుండానే నలుగురు బిడ్డలకు తల్లినయ్యానే కానీ ఇలాటి....ఇలాటి మధుర ప్రేమను క్షణమైనా చవిచూచానా?

నాకు ఆ పదేళ్ళ జీవితం, అనుమానాలను, అవమానాలను, దెబ్బలను, నైరాశ్యాన్ని మిగిలిస్తే, పదినెలలు రాజశేఖర్‌తో నా పరిచయం, నాలో మరో వందేళ్ళు నిశ్చింతగా బ్రతకగలిగేంత జీవాన్ని నింపింది. కానీ ఈ స్నేహం సంఘ విదూరం....ఇది తప్పు...."

"అయితే తెలిసీ తప్పెందుకుచేసావు?" అని అడగకుండా వుండలేకపోయాను.

నేను సైన్స్ డాక్టర్ని. పవిత్ర భారతస్త్రీని. అలా అడిగినందుకు నామీద నాకే అసహ్యం కలిగింది. ఆమె విరక్తిగా నవ్వింది.

"చెప్పానుగా డాక్టర్‌గారూ! నాకు మమకారం కావాలి. నన్ను మాత్రమే కావాలనుకునే వ్యక్తి నాకు కావాలి.

అలాటి రాజశేఖరం దొరకగానే నేను బలహీనురాలినైపోయాను. ప్రతి క్షణం నేనుకోరే అతని మమకారం, అతని సాన్నిహిత్యం కూడా ఈ సమాజం భాషలో చెడిపోవడం క్రిందకే వస్తుందంటే, నేను చెడిపోయి, పదినెలలయిందని ధైర్యంగా ఒప్పుకుంటున్నాను."

నాలో ఇక మరి ప్రశ్నవేసే శక్తి మిగలలేదు.

కానీ....కానీ డాక్టర్!

అతనిమీద కొండంత మమకారాన్ని నా చిన్ని గుండెల్లో పదిలపరచుకుని, ఆ మమకారాన్నితిరిగి అనుభవిస్తున్న నాలో ఇంత అశాంతి ఎందుకు?

మనసు ఒక్కోమారు రెక్కలు విప్పుకుంటుంది.

ఒక్కోసారి అకారణంగా కుంచించుకుపోతుంది. ఒక్కోసారి నేను చేస్తున్నది తప్పనిపిస్తుంది.

ఒక్కోసారి కాదనిపిస్తుంది.

నా కప్పుడప్పుడూ నా ప్రవర్తనమీద నాకే అసహ్యమనిపిస్తుంది.

నా భావుకతమీద నాకే కోపమొస్తుంది.

అందరి ఆడవాళ్ళలాగ, ఉన్నంతలో తృప్తిపొందలేని నా మనస్తత్వంమీద విసుగేస్తుంది.

నేను పతితనైపోయినట్టు ఒంటరిగా కూర్చుని ఏడుస్తాను. ఎవరికో ద్రోహం చేస్తున్నట్టు పశ్చాత్తాపపడుతుంటాను.

రాజశేఖర్ దగ్గర మరీ!

అనంతమైన ఆనందాన్ని పొందుతున్న నా గుండె ఎవరో పిండినట్టు బాధపడుతుంది.

ఎందుకు డాక్టర్ ఇలా ఎందుకు జరుగుతోంది? దీనినుండి తప్పించుకోవటానికి నేనేం చేయాలి?

నేను జవాబు చెప్పలేదు. ఏమి చెప్పాలా అని ఆలోచిస్తున్నాను. ఆమె కూడా చాలా సేపటిదాకా మాట్లాడలేకపోయింది. నా టేబుల్‌మీద

వస్తువులను అటూ ఇటూ అసంకల్పితంగా సర్దుతూ కూర్చుంది. అయిదు నిమిషముల తర్వాత తలెత్తి నా కళ్ళల్లోకి చూస్తూ హటాత్తుగా అంది.

"చూడండి డాక్టర్! నన్ను మా అమ్మా, మా వారూ ఎంత అన్యాయం చేసారో!" ఆ పిల్ల కళ్ళల్లో ఈసారి దైన్యమైన కన్నీళ్ళు.

"మీ అమ్మా....?"

"నా కళ్ళముందు మా పడకగదిలో, నా భర్తతో వుంటున్నది ఎవరో తెలుసా డాక్టర్‌గారూ! ఆమె నా తల్లి. నన్ను కని, పెంచిన తల్లి."

అదిరిపడ్డాను నేను.

"నేను నమ్మను."

"కానీ నేను చెపుతున్నది పచ్చినిజం. కథ కాదు...." ఆమె ఆగింది.

నేనింకా కోలుకోలేదు.

"ఒక్కోసారి నా అంతరాత్మ వాళ్ళను క్షమించేయమంటుంది. కానీ డాక్టర్‌గారూ! నన్ను పువ్వులా, పదిలంగా చూసుకోవాల్సిన నా తల్లి, నా భర్త నా సుఖాన్ని వెచ్చించి, వాళ్ళ సుఖాల్ని కొనుక్కుంటుంటే, నన్ను అన్నీ వున్న అనాధనుచేసి వదిలితే....ఎలా? ఎలాండీ క్షమించడం?"

"డాక్టర్‌గారూ! నన్ను ఒక్కో క్షణంలో చచ్చిపోవాలన్నంత విరక్తి చుట్టుకుంటుంది. నా సమస్యకు అది తప్ప మరో పరిష్కారం లేదనిపిస్తుంది. లేదా పిచ్చిపడ్తే బాగుణ్ణనిపిస్తుంది.

నా సమస్యకెవరయినా పరిష్కారం చూపిస్తే వాళ్ళకు చేతులు జోడించాలనిపిస్తుంది.

అసలు ఇంత శూన్యంగా, ఇంత హీనంగా, ఇంత విరక్తిగా బ్రతక్కపోతేనేమనిపిస్తుంది. నేనిలా అతని చల్లని చేతుల్లో వాలి బాధ పడుతుంటే అతనంటాడు—

"పోనీ విజయా! నీకు ధైర్యం వుందా చెప్పు, మనిద్దరం పెళ్ళి చేసుకుందాం. నీ పిల్లలకు నేను తండ్రినవుతాను."

నేను పులకించిపోయాను. వెంటనే యదార్థం గుర్తుకొచ్చి నా స్వంతమైన నైరాశ్యంలోనికి తిరిగి వచ్చేస్తాను. అప్పుడు నా గురించి ఏమనుకుంటారు?

నా భర్త నా గురించి ఏమనుకుంటాడు? నన్ను ఎంతో సమాజంలో నాపిల్లల స్థానమేమిటి? వాళ్ళ భవిష్యత్తేమిటి? అసలు.....అసలు రాజశేఖర్ ప్రేమని వాళ్ళు సవ్యంగా అర్థంచేసుకోగలుగుతారా? ఈ సమాజం వాళ్ళని పాయిజన్ చేయకుండా వుంటుందా?

ఇన్ని సమస్యల మధ్య, వాటిలో తాలూకు వ్యధల మధ్య, నేనతనికి అందమైన వైవాహిక జీవితాన్నివ్వ గలుగుతానా? ఒకసారి భార్యనేత క్రూరంగా వంచించబడ్డ అతని జీవితాన్ని అశాంతి పాలు చేసే అమానుషత్వం నాలో వుండచ్చా?"

ఆ ప్రశ్నలన్నీ అపిల్ల నన్నడగంలేదు. ఆ పిల్ల అంతరాత్మ ఆ పిల్ల కోరికను ప్రశ్నిస్తోంది.

"డాక్టర్‌గారూ అతనంటాడు, 'విజయా! నీపిల్లలు పెద్దవాళ్ళయి, ఇంకా ఏనాడో ఎందుకో ఏర్పచిన సాంప్రదాయాలను పట్టుకుని వేలాడుతున్న ఈ సమాజాన్ని ఎదుర్కోలేక, ఇలా ఎందుకు చేసావమ్మా?' అని నిలదీసి అడిగితే....

నీ ప్రియమైన పిల్లలే నిన్ను దోషిగా నిలబెడితే నువ్వు భరించలేవు. ఆ స్థితిలో నిన్ను నేను చూడలేను. అలాటి పరిస్థితుల్లో మనం పెళ్ళిచేసుకోవడంలో అర్థంలేదు విజయా! మనం కేవలం స్నేహితు

చ్ఛగా మిగిలిపోదాం నీ భర్తను నేను మార్చడానికి ప్రయత్నిస్తాను" అని.

ఆ అమ్మాయి తన ప్రియమైన స్నేహితుడి అందమైన మనసును గుర్తుతెచ్చుకుని అతనిమీద ఆరాధనతో అక్కడ ఒక్క నిముషం ఆగింది.

"నాకూ అప్పుడప్పుడూ అనిపిస్తుందండీ. కథలలోనూ, సినిమాల్లోనూ, ప్రతి మనిషి నోటిలోనూ ఎంతో పవిత్రంగా వర్ణించబడుతున్న ఆడదాని శీలాన్ని, కొన్నిరోజుల సుఖంకొరకు నేనెందుకు వెచ్చించాలి? ఇలాగే మిగిలిన కాలాన్నికూడా దొర్లిపోనీ...." ఇలా అనుకునేంతలో గుండెఅంతా బరువనిపిస్తుంది.

"అసలు మన జీవితమే స్వల్పం. అందులో ఈ మధ్యకాలం ఎంత విలువయింది. దానిని ఎందుకు వృధాచేసుకోవాలి? సుఖపడడానికి మార్గాలున్నప్పుడు ఎవరి కొరకో ఎందుకు కష్టపడాలి? చచ్చిపోయాక సుఖమూ మిగలదు, కష్టమూ మిగలదు. అలాటప్పుడు ఈ బ్రతుకు వెందుకు భారం చేసుకోవాలి?"

అతను తన క్షేమకరమయిన బాహువుల్లోకి నన్ను రమ్మంటున్నాడు. నేనెందుకు పోకూడదు?....నాకువెళ్ళాలనివుంది.. కానీ ఇప్పుడు కాదు. కాలం పదిహేను సంవత్సరాల వెనక్కు తిరిగి....నాకే నవ్వొస్తోంది డాక్టర్.

నాకు పెళ్ళి కాకముందు అతనితో పరిచయమైనట్టు అతను, నన్ను పెళ్ళి చేసుకోమని అడుగుతున్నట్టూ.... ఆ మధురమైన సన్నివేశాన్ని ఊహల్లో అనుభవిస్తూ, నా సమస్యను పరిష్కారాన్ని వెతుక్కునే బాధ్యతనుండి కొన్ని నిముషాలపాటు తప్పుకుంటుంటాను.

ఆ పిల్ల చెపుతుంది. ఒకోక్కసారి నా కళ్ళల్లోకి చూస్తూ, ఒకోక్కసారి తల వంచుకొని, ఒకోక్కసారి దీనంగా, ఒకోక్కసారి ఉత్సాహంగా చెపుతున్న ఆమె చప్పున స్పృహతోకొచ్చిన దానిలా అడిగింది-

"చెప్పండి డాక్టర్‌గారూ! నేను చేసింది తప్పా? నేను చెడిపోయా నంటారా? నాకు నిజమయిన ఆనందం కావాలి. ఒక్కోరోజు నా మనసు నిజంగా నవ్వాలి. చెప్పండి డాక్టర్‌గారూ! మీరు నాకేం సలహా యిస్తారు?"

నేను ఒక్క క్షణమయినా ఆలోచించలేదు. వెంటనే నా మనసు తెరిచాను.

"నువ్వు రాజశేఖరాన్ని వెంటనే పెళ్ళిచేసుకో. నిన్ను ఉద్ధరించని నీ భర్త కొరకు, నిన్ను అన్యాయం చేసిన నీ తల్లికొరకు, కేవలం నీ కష్టాలకు సానుభూతి చూపిస్తూ నువ్వు సుఖాన్ని వెతుక్కొంటే దాన్ని ఆమోదింపని ఈ సంఘం కొరకు, జీవితంలో వ్యర్థం చేసుకోకు. నీ పిల్లలను, నిన్ను అతను జీవితాంతం చూసుకుంటాడనే నమ్మకం నీకుంటే, క్షణమైనా ఇక ఆలోచించవద్దమ్మా విజయా, అతనితో సరేనని చెప్పేయ్" ఆ మాటలు నా నాలుక కొసవరకు వచ్చి ఆగిపోయాయి.

కానీ, ఆ పిల్ల మన స్తత్వమేమిటి? భారతదేశపు పవిత్రత పాడు రక్తం ఆ పిల్ల రక్తనాళాల్లోనూ ప్రవహిస్తోంది. నాకు తెలుసు, ఆ తర్వాత సాంప్రదాయాల మైకంలో యింకా యింకా మగ్గిపోతున్న ఈ సమాజాన్ని తట్టుకునే శక్తిలేక మానసిక సంఘర్షణలో ఆ పిల్ల పూర్తిగా మగ్గిపోతుంది....

అందుకే మరలా ఇలా చెప్పాలని నిర్ణయించుకున్నాను. మంచో, చెడ్డో ఆ పిల్లకు ఏదో దారిచూపి ఆ పిల్ల అశాంతినుండి ఆమెను బయట పడేయాలనుకున్నాను. నేను చెప్పేది సమంజసమని నేను నమ్మకుండానే ఆమెను నమ్మించాలని చూసాను.

"చూడమ్మా విజయా! మన సంప్రదాయాలు మన రక్తంలో జీర్ణించుకు పోయాయి. ఎంతోకాలం ప్రతకం. ఎలాగోలా ఈ జీవితంతోనే సర్దుకుపోవడానికి ప్రయత్నించాలి.

ఇక్కడా నేను ఆ మాటలు పైకి అనడానికి అశక్తురాలనై పోయాను.

"ఎలాగోలా ఈ జీవితాన్ని సర్దుకుపోవాలా? ఎందుకు? ఎవరి కోసం? అసలా అమ్మాయి తన భర్తను కాదని మరో పరాయి మగ వాడి ఆశ్రయాన్ని ఎందుకు కోరుతోంది? ఎవరు దానికి కారణం? ఎవరు? ఆమె భర్త....

రాజశేఖరం చేతులు చాచి తననూ, తన బిడ్డల్నీ తన చల్లటి నీడలోకి రమ్మంటుంటే ఆమె ఎందుకు సందేహిస్తోంది? ఎవరు దానికి కారణం? ఎవరు? ఈ సమాజం.

తనకేమీ ఇంత సుఖాన్ని, ఇంత శాంతినీ ఇవ్వలేని ఆమె భర్త. ఆ సమాజం ఆ బ్రతుకునెందుకు శాసించాలి? ఆ పిల్ల ఎవరికీ అన్యాయం చేయనప్పుడు ఆమె వెళ్ళే మార్గానికి వాళ్ళెందుకు అడ్డు పడాలి?

ఈ పసిపిల్ల ఈ మానసిక సంఘర్షణకు కారణం ఎవరు? ఆమె భర్తా? ఆమె తల్లా? రాజశేఖరమా? లేక ఆమెలో జీర్ణించుకున్న అర్థం లేని ఈ హిందూ సంప్రదాయాలా? ఎవరు? ఎవరు? ఎవరు దానికి కారణం?

కారణం ఏదయినా కానివ్వండి. మానసిక అనారోగ్యంతో నా దగ్గరకొచ్చి చెప్పండి "డాక్టరుగారూ! నాకు నిజం అయిన ఆనందం కావాలి ఒక్కరోజంటే ఒక్కరోజు నా మనసు నిజంగా నవ్వాలి నాకేం సలహా ఇస్తారు?"

అని అడిగిన ఆ శాపగ్రస్తురాలికి అలాటి పిచ్చి సలహా యిచ్చి, ఈరోజు కేవలం మానసిక అనారోగ్యంతో వచ్చిన ఈ పిల్లను, రేపుఅంత అపురూపమైన వ్యక్తిని పోగొట్టుకున్న దురదృష్ట వంతులుగా పిచ్చి దానిలా చూడాలని లేదునాకు. అందుకే ఖచ్చితంగా చెప్పాను.

"ఇందులో తప్పేం లేదుతల్లీ! మన జీవితాలకు పరిష్కారాన్ని

మనమే వెతుక్కోవాలి. ఎవరో వెతికి పెడ్తారనుకోవడం పిచ్చితనం. నువ్వు రాజశేఖరాన్ని పెళ్ళి చేసుకో."

"నీ పరిస్థితిలో ఒక మగవాడుంటే, వాడు చేసేపని ఇదే అయినప్పుడు నువ్వు అదే పని చెయ్యవద్దనిశాసించే అధికారము నాకేకాదమ్మా ఈ సమాజానిక్కూడా ఆఖరుకు నీ బిడ్డలకు కూడా హక్కులేదు.

అతను నిన్ను, నీ బిడ్డలను సవ్యంగా చూసినప్పుడు నీ పిల్లలు పెద్దవాళ్ళయి- "ఇలా ఎందుకు చేసావమ్మా?" అని నిలదీసిఅడిగితే, తప్పకుండా నువ్వు బాధపడాలమ్మా విజయా.

కాని బాధపడాల్సింది నువ్వు తప్పు చేసావేమోనని పశ్చాత్తాపముతో కాదు. నీ బిడ్డలు ఇంత సంకుచితులా అనే వ్యధతో ఆ విషయం ఈ సమాజం గుర్తించకపోతే, అది దాని ఖర్మ. నువ్వు నీ బిడ్డలతో నీకు నచ్చిన చల్లటి ఆశ్రయాన్ని వెతుక్కోవడంలో పూర్తిగా తప్పులేదు విజయా!"

విజయ కళ్ళు మెరిశాయి.

కానీ నాకు తెలుసు. ఆమె రాజశేఖరాన్ని పెళ్ళి చేసుకోదు కారణం ఆమె ఆ బిడ్డలకు తండ్రికాదు తల్లి.

ఆమె వెళ్ళిపోయినా నేను ఆలోచిస్తూ వుండిపోయాను. పిల్లల కోసం ఆమె మరో పదేళ్ళో, ఇరవయ్యేళ్ళో ఇలా నిరాసక్తంగా జీవితాన్ని గడపాలా? ఆ తర్వాత పిల్లలు రెక్కలు వచ్చి ఎగిరిపోతే—ఆమె ఏకాకిగా మిగిలి పోవాలా?